సాక్షి కర్నూలు

శుక్రవారం । 12 । జూలై । 2024



దత్తాత్రేయ స్వామికి పూజలు

శ్రీశైలం టెంపుల్: లోక కల్యాణం కోసం గురువారం ఆలయ ప్రాంగణంలోని దత్తాత్రేయస్వామికి సర్కారు సేవగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అలరించిన ప్రవచనం

శ్రీశైలంటెంపుల్: నిత్య కళా వేదికపై గురువారం రాజమహేంద్రవరానికి చెందిన తాతా సందీప్ శర్మ వారి శివలీలామృతంపై ప్రవచన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,606
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:29
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:25,349
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:205

న్యూస్‌రీల్

మత్స్యశాఖలో ప్రస్తుతం పథకాల్లేవ్

- దళారులను ఆశ్రయించొద్దు
- మత్స్యశాఖ డీడీ శ్యామల

కర్నూలు(అగ్రికల్చర్): ప్రస్తుతం మత్స్యశాఖ ఎటువంటి పథకాలు అమలు చేయడం లేదని, కొత్తగా అమలు చేసే పథకాలకు సంబంధించి ఇంకా మార్గదర్శకాలు రావాల్సి ఉందని మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్యామల తెలిపారు. కర్నూలు బంగారు పేటలోని మత్స్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం ఆమె మాట్లాడుతూ... పథకాల కోసం దళారులను ఆశ్రయించాల్సిన అవసరం లేదని, నేరుగా తమ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన మార్గదర్శకాలు కూడా మారుతున్నాయని తెలిపారు. త్వరలోనే అన్ని వివరాలు తెలియచేస్తామని స్పష్టం చేశారు.

ఒకే స్కూల్‌కు రెండు పేర్లు!

- ఎంఈఓల విచారణలో వెలుగులోకి




పత్తికొండలోని శ్రీచైతన్య పాఠశాలలో విచారణ జరుపుతున్న ఎంఈఓలు

పత్తికొండ రూరల్: ఒకే పాఠశాలకు రెండు పేర్లు ఉన్నాయి. ఈ విషయం ఎంఈఓల విచారణలో వెలుగు చూసింది. పత్తికొండ పట్టణంలో యశోదాగార్డెన్ పేరుతో ఉన్న పాఠశాలకు శ్రీచైతన్య పేరు పెట్టి విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకుల ఫిర్యాదు మేరకు గురువారం ఎంఈఓలు తిమ్మారెడ్డి, రమేష్ పాఠశాలలో విచారణ జరిపారు. విద్యార్థుల తరగతి గదికి వెళ్లి మీరు ఏ పాఠశాలలో చదువుతున్నారని ప్రశ్నించగా కొందరు విద్యార్థులు శ్రీచైతన్య స్కూల్‌లని, మరికొందరు యశోదా గార్డెన్ అని చెప్పారు. పుస్తకాలు, యూనిఫాం పాకెట్స్ లేబుల్స్ మీద శ్రీచైతన్య పాఠశాల అని ముద్రితమై ఉండటంతో ఎందుకిలా ఉన్నాయని పాఠశాల నిర్వాహకులను ప్రశ్నించగా తమకు ఎలాంటి సంబంధం లేదని, టైలర్లు అలా వేశారని పొంతనలేని సమాధానం ఇచ్చారు. విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెడుతూ విద్యా వ్యాపారానికి తెగబడిన పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. పాఠశాల స్టోర్ రూంను విద్యాధికారులు సీజ్ చేశారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కర్నూలు కల్చరల్: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 2024–25 విద్యా సంవత్సరానికి నాలుగేళ్ల హానర్స్ డిగ్రీ కోర్సు మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తు గడువును పొడిగించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఓఏఎండీసీ పోర్టల్ ద్వారా ఈనెల 20వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వర్సిటీలో బీఏ ఎకనామిక్స్ హానర్స్, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్ హానర్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ హానర్స్ కోర్సుల్లో విద్యార్థులు చేరవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 7993422489, 9490494532, 8520017815 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

జియో టూరిజం స్పాట్‌గా రాక్‌గార్డెన్



ఓర్వకల్లు రాక్ గార్డెన్

కర్నూలు (టౌన్): జియో టూరిజం స్పాట్‌గా ఓర్వకల్లు రాక్ గార్డెన్‌ను అభివృద్ధి చేసేందుకు జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఎంపిక చేసింది. ఆ సంస్థ ప్రతినిధి హరిక్రిష్ణ ఆధ్వర్యంలో బృంద సభ్యులు గురువారం హెరిటేజ్ స్థలాలను సర్వే చేశారు. అందులో భాగంగా జిల్లాలోని ఓర్వకల్లు గార్డెన్‌ను డ్రోన్ వీడియో, హైరెసల్యూషన్ వీడియోగ్రఫీ ద్వారా సర్వే చేసి.. జియో టూరిజం స్పాట్‌గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వానికి చెందిన జియోలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఓర్వకల్లు రాక్ గార్డెన్‌ను జియో టూరిజంకు ఎంపిక చేసిందన్నారు. దీంతో త్వరలో రాక్‌గార్డెన్‌లో అభివృద్ధి పనులు జరిగే అవకాశం ఉందన్నారు.

పిల్లలకని హామీ.. తల్లికని వెన్నుపోటు!



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు



ఈ చిత్రంలో ఇద్దరు కుమార్తెలతో ఉన్న ఈమె పేరు పూల శ్రీదేవి. కృష్ణగిరి మండలం టి.గోకులపాడు గ్రామానికి చెందిన ఈమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఎకరా పొలం ఉండటంతో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పిల్లలకు మంచి భవిష్యత్తు ఉండాలనే లక్ష్యంతో చదివిస్తున్నారు. పెద్ద కుమార్తె శృతిహాసన్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడో తరగతి, చిన్న కుమార్తె అమృత, కుమారుడు గణేష్ కోడుమూరు మండలం గోరంట్ల గ్రామంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మూడు, నాలుగో తరగతి చదువుతున్నారు. ఇంట్లో ఎంత మంది చదువుకుంటే అంత మంది పిల్లలకు అమ్మకు వందనం పథకం కింద రూ.15 వేల చొప్పున డబ్బులు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, ఆయన మాటలు నమ్మి పిల్లలను ప్రైవేట్ స్కూల్‌లో చేర్పించామని, ఇప్పుడు ఒకరికే అని చెబితే ఎక్కడి నుంచి డబ్బు తేవాలని పూల శ్రీదేవి ప్రశ్నించారు.

'తల్లికి వందనం'లో చీకటికోణం

- అర్ధరాత్రి జీఓలో అంతులేని మోసం
- ఒక్కో విద్యార్థికి రూ.15వేలని ఎన్నికల హామీ
- ప్రచారంలో ఊదరగొట్టిన చంద్రబాబు, కూటమి నేతలు
- ఇప్పుడు తల్లికి రూ.15వేలని స్పష్టం
- ఒక్కరితో సరిపెడితే మిగతా పిల్లల సంగతేంటనే ప్రశ్న
- భారం కానున్న ఫీజులతో తల్లిదండ్రుల రోదన

సాక్షి ప్రతినిధి కర్నూలు: నేటికి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి సరిగ్గా నెల. ఈ నెలరోజుల్లో రెండో హామీతో ప్రజలను వంచిస్తున్నారు. ఉచితంగా ఇసుక ఇస్తానని చెప్పి టన్నుకు రూ.335 ధర నిర్ణయించిన ప్రభుత్వం, ఇప్పుడు 'తల్లికి వందనం' పథకం అమలులో కూడా మాట తప్పింది. ఇంట్లో బడికి వెళ్లే విద్యార్థులు ఎంతమంది ఉంటే అందరికీ రూ.15వేలు చొప్పున చెల్లిస్తామని ఎన్నికల ప్రచారం, మేనిఫెస్టోలోనూ 'కూటమి' ఇదే విషయాన్ని ప్రకటించింది. అధికారంలోకి వచ్చాక జారీ చేసిన జీఓలో మాత్రం ఒక్క తల్లికి ఏడాదికి రూ.15వేలు మాత్రమే ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించింది. ఈ లెక్కన ఇద్దరు పిల్లలు ఉంటే రూ.30వేలు, ముగ్గురు ఉంటే రూ.45వేలు అందాల్సిన తల్లులకు ఏడాదికి రూ.15వేలు మాత్రమే అందనుంది. 2014 ఎన్నికల్లో నిరుద్యోగ భృతి, రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీతో పాటు పలు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అప్పుడు హామీల అమలులో విఫలమయ్యారు. 2024 ఎన్నికల ముందు కూడా అలవికాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారు. తీరా ఇప్పుడు ఒక్కొక్క హామీని తుంగలోకి తొక్కి యథావిధిగా ప్రజలను మోసం చేస్తుండటం గమనార్హం.

అర్హుల జాబితా ఉన్నప్పటికీ మళ్లీ ఆధార్ నమోదు

'అమ్మ ఒడి' పేరుతో ఏటా తల్లుల ఖాతాల్లోకి రూ.15వేలు జమ చేసింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం. అందులో తొలి రెండు విడతల్లో స్కూలు మెయింటెనెన్స్ కోసం రూ. వెయ్యి చొప్పున కట్ చేసి రూ.14వేలు తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఆపై రూ.2వేల చొప్పున కట్ చేసి రూ.13వేలు అందించారు. ఈ విషయాన్ని బహిరంగంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పి స్కూళ్లు పరిశుభ్రంగా ఉండాలి.. శుభ్రతపై ప్రశ్నించే హక్కు తల్లులకు ఉండాలని ఈ మొత్తాన్ని కట్ చేస్తున్నట్లు చెప్పి, వారి ఆమోదంతో పథకాన్ని అమలు చేశారు. కర్నూలు జిల్లాలో ఒకటి నుంచి ఇంటర్మీడియట్ అభ్యసించే విద్యార్థుల వరకు నాలుగేళ్లలో రూ.1438.87కోట్లు తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఈ ఏడాది జూన్‌లో ఐదో విడత జమ కావాలి. అయితే ప్రభుత్వం మారడంతో ఇందుకు బ్రేక్ పడింది. లబ్ధిదారుల జాబితా ప్రభుత్వం వద్ద ఉంది. అర్హులైన వారు ఉంటే వారు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఇప్పటి ప్రభుత్వం తల్లులకు మాత్రమే ఇస్తామని మోసం చేయడంతో పాటు ఇచ్చే మొత్తాన్ని కూడా ఎప్పుడు ఇస్తామని స్పష్టం చేయలేదు. తాజాగా ఆధార్‌తో పాటు బ్యాంకు పాస్‌బుక్ లేదా ఇతర ప్రభుత్వ ధృవీకరణ పత్రాలతో తిరిగి దరఖాస్తు చేయాలని సూచించింది. అయితే దరఖాస్తు ఎప్పటిలోపు చేయాలి? పథకం ఎప్పుడు అమలు చేస్తారనే విషయాలను స్పష్టం చేయలేదు. దీంతో పథకం ఎప్పుడు అమలు చేస్తారో? ఖాతాల్లో ఎప్పుడు డబ్బులు జమ అవుతాయో కూడా తెలియని పరిస్థితి. విద్యార్థులు బీపీఎల్(దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు) కింద ఉండటంతో పాటు విద్యార్థుల హాజరు 75శాతం ఉండాలనే నిబంధనలను కూడా తెరపైకి తీసుకొచ్చింది.

ఆందోళనలో తల్లిదండ్రులు

ప్రభుత్వ జీఓపై తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. ఆటోడ్రైవర్లు, వీధివ్యాపారులు, దుకాణాల్లో పని చేసే గుమస్తాలతో పాటు సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు చంద్రబాబు అధికారంలోకి వస్తే ఒక్కో విద్యార్థికి రూ.15వేల చొప్పున డబ్బులు ఇస్తారని ఆశపడ్డారు. దీంతో ఇంట్లో ఇద్దరు, ముగ్గురు పిల్లలు ఉంటే అందరినీ మంచి చదువుల కోసం ప్రైవేటు పాఠశాలలకు పంపారు. ప్రభుత్వం ఇద్దరికి రూ.30వేలు, రూ.45వేలు చెల్లిస్తే తక్కిన మొత్తాన్ని తాము కొంత భరించి పిల్లలను మంచి చదువులు చదివించుకోవచ్చని ఆశపడ్డారు. తీరా పిల్లలను బడికి పంపిన తర్వాత ప్రభుత్వం మాట మార్చడంతో తల్లిదండ్రులు నిలువునా మోసపోయారు. ఇప్పుడు బడికి పంపిన పిల్లలను తిరిగి ప్రభుత్వ పాఠశాలలకు పంపలేరు. ప్రైవేటులో కొనసాగిస్తే ఫీజులు భరించలేరు.

Scheme	Description
TALLIKI VANDANAM	As a part of Government Assured Flagship Programs, the Government under "TALLIKI VANDANAM" scheme is providing financial assistance of Rs.15,000/- per annum to each mother or recognized guardian who is below poverty line household and sending their children to schools/colleges i.e., from Classes I to XII.
STUDENT KITS	Under Vidya Kanuka, the Government school students of Classes I to XII are provided with the following benefits: (i) Bilingual Textbooks (English content on one page and Telugu version on the opposite page) (ii) Notebooks and Workbooks (iii) Three pairs of Uniforms with stitching charges (iv) A pair of Shoes and two pairs of Socks (v) A Belt and a School Bag (vi) Pictorial dictionary, Oxford dictionary

TALLIKI VANDANAM:

Talliki Vandanam, aims to ensure that no child misses out on education due to poverty. This innovative scheme supports mothers in sending their children to school regularly, significantly reducing the dropout rate.

ఇది గత మంగళవారం అర్ధరాత్రి ప్రభుత్వం జారీ చేసిన జీఓ 29. 'తల్లికి వందనం' పథకం పేరుతో ప్రతీ తల్లికి ఏడాదికి రూ.15వేల ఆర్థిక భరోసా కల్పించనున్నట్లు పేర్కొంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉండి ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు పిల్లలను బడి లేదా కాలేజీకి పంపే తల్లి లేదా పిల్లల సంరక్షులకు ఈ సాయం అందుతుందని ప్రకటించింది.

'తల్లికి వందనం' పథకం కింద మీ ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరికీ ఏడాదికి రూ. 15,000లు



ఇది టీడీపీ మేనిఫెస్టో. సూపర్‌సిక్స్ పేరుతో బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు ఇస్తామని పొందుపరిచింది. మంత్రాలయం, కోడుమూరు, డోన్, బనగానపల్లెతో పాటు పలు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన చంద్రబాబు, నంద్యాలకు ప్రచారానికి వచ్చిన లోకేశ్ ఒక బిడ్డ బడికి వెళితే రూ.15వేలు, ఇద్దరు వెళితే రూ.30వేలు, ముగ్గురు వెళితే రూ.45వేలు ఇస్తామని నమ్మించారు. వీరి మాటలు నమ్మి ఎంతో మంది పిల్లల తల్లిదండ్రులు టీడీపీకి ఓట్లు వేసి గెలిపించారు.



గుడిసె ముందు నిల్చున్న ఈమె పేరు తిక్కమ్మ. మండల కేంద్రమైన కౌతాళానికి చెందిన ఈమెకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. భర్తతో కలసి బిందెల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈమెకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తె మారెమ్మ స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆరో తరగతి, చిన్న కుమార్తె జమ్మక్క స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి, కుమారుడు రవీంద్ర అదే పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి అమ్మకు వందనం పథకం ఇస్తామని చెప్పడంతో సంతోషించామని తిక్కమ్మ తెలిపారు. రెక్కల కష్టంతో బతుకుతున్న పేదలను మోసం చేయకుండా ముగ్గురి పిల్లలకు కూడా డబ్బులు ఇవ్వాలని ఈమె ప్రభుత్వాన్ని కోరారు.

లబోదిబో..

ఇంట్లో ఇద్దరు పిల్లలు ఉంటే రూ.30వేలు, ముగ్గురు ఉంటే రూ.45వేలు చంద్రబాబు ప్రభుత్వం ఇస్తుందని పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపారు. స్కూళ్లు తెరిచి నెల రోజులైంది. కొందరు అప్పులు తెచ్చి తొలివిడత ఫీజులు చెల్లించారు. మరికొందరు ప్రభుత్వం డబ్బులు వస్తే చెల్లిద్దామని ఎదురు చూస్తున్నారు. ఈక్రమంలో ప్రభుత్వం జారీ చేసిన జీఓ 29 సామాన్య, మధ్య తరగతి పిల్లల తల్లిదండ్రుల గుండెల్లో గునపం దింపింది. చంద్రబాబును నమ్మి పిల్లలను బడికి పంపిస్తే ఎన్నికల్లో ఒకలా చెప్పి, ఇప్పుడు మరోలా మాట మార్చాడేంటి? అని అంతా పెదవి విరుస్తున్నారు.

గత ప్రభుత్వంలో అమ్మ ఒడి లబ్ధిదారుల వివరాలు

సంవత్సరం	విద్యార్థుల తల్లుల సంఖ్య	ఖాతాల్లో జమ చేసిన మొత్తం(రూ.కోట్లు)
2019-20	2,26,597	339.89
2020-21	2,47,785	371.66
2021-22	2,42,645	363.96
2022-23	2,42,241	363.36
మొత్తం		1,438.87

ఎదురుచూస్తున్నాం



నాకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారిలో ఇద్దరు చిన్నపిల్లలు. మరో ఇద్దరు హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు, తొమ్మిది తరగతులు చదువుతున్నారు. మాకు రెండెకరాల పొలం తప్ప ఏ ఆధారం లేదు. కూలి పనులు చేసుకుని బతుకుతున్నాం. అమ్మకు వందనం పథకం కింద రూ.15 వేలు ప్రకారం రూ.30 వేలు వస్తాయని ఎదురు చూస్తున్నాం. అయితే ఒక్కొక్కరు ఒక్కో విధంగా అనుకుంటుండడంతో ఎప్పుడు డబ్బులు పడ్తాయో అని ఆందోళన కలుగుతోంది. ఇచ్చిన మాట ప్రకారం ఎంత మంది పిల్లలు అంటే అంత మందికి అమ్మకు వందనం పథకం కింద డబ్బులు ఇవ్వాలి.

– సమ్మతగేరి భాగ్యమ్మ, హొళగుంద

మాట నిలబెట్టుకోవాలి



నా కుమారుడు చార్విక్ ఏడో తరగతి, కుమార్తె గోపిక నాలుగో తరగతి చదువుతున్నారు. ఎన్నికల ముందు అమ్మకు వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకున్నా ఒక్కొక్కరికి రూ. 15 వేలు చొప్పున ఇస్తానని చెప్పటంతో మేం ప్రైవేటు స్కూల్లో ఫీజు ఎక్కువైనా చేర్పించాం. అయితే ఇప్పుడు మాట మార్చి ఇంట్లో ఒక్కరికే రూ. 15 వేలు ఇస్తానని చెప్పటంతో ఆందోళన చెందుతున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ. 15 వేల చొప్పున చెల్లించి మాట నిలబెట్టుకోవాలి.

– కళావతి, ఎమ్మిగనూరు

ఆర్థిక స్తోమత లేదు



మాది నిరుపేద కుటుంబం. మా ఆయన ప్రకాశ్ హోటల్‌లో సర్వర్‌గా పని చేస్తాడు. నేను కూలి పనులకు వెళ్తున్నా. మాకు నలుగురు ఆడ పిల్లలు. నీహారిక, కావ్య, కీర్తన.. ముగ్గురు పిల్లలు ప్రభుత్వ బడుల్లోనే చదువుతున్నారు. చిన్నమ్మాయి నిధి అంగన్‌వాడీ బడికి వెళ్తుంది. గత ఏడాది అమ్మ ఒడి పథకం కింద రూ.15 వేలు వచ్చింది. ఈ ఏడాది ఇంకా రాలేదు. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి డబ్బులు ఇస్తామన్నారు. పిల్లలను చదివించే ఆర్థిక స్తోమత లేని మాలాంటి వారికి ఇస్తే మంచిది.

– శ్వేత, ఆదోని

ప్రత్యేక కౌంటర్లలో బియ్యం, కందిపప్పు పంపిణీ



కర్నూలు సీ.క్యాంపు రైతుబజారులో కౌంటరును ప్రారంభిస్తున్న జేసీ నారాపురెడ్డి మౌర్య

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెట్‌లో కందిపప్పు, బియ్యం ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి వీటిని కాస్త తక్కువ ధరకు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కర్నూలు సీ.క్యాంపు రైతుబజారులో ఏర్పాటు చేసిన కౌంటరును గురువారం జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రస్తుతం మార్కెట్‌లో కంది పప్పు ధర రూ.181 ఉందని, ప్రత్యేక కౌంటర్లలో రూ.160 ప్రకారం పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్టీమ్డ్ బీపీటీ సోనామసూరు బియ్యం కిలో రూ.55.85 ఉండగా...కౌంటర్లలో రూ.49 ప్రకారం, పచ్చి బీపీటీ సోనామసూరి బియ్యం కిలో 52.40 ఉండగా.. కౌంటర్లలో రూ.48 ప్రకారం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కర్నూలు సీ.క్యాంపు, అమీన్ అబ్బాస్‌నగర్ రైతుబజార్లలో, మండి, మోర్ మార్కెట్లలో, డిమార్ట్, స్పెన్సర్, జ్యోతి మాల్, రిలయన్స్ మార్టులతో పాటు ఆదోని రైతుబజారులో కూడా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కొక్కరికి కిలో కందిపప్పు, ఐదు కిలోల బియ్యం పంపిణీ చేస్తామని, ఆధార్, రేషన్ కార్డులో ఏదో ఒకటి చూపాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్‌డీవో శేషిరెడ్డి, డీఎస్‌వో కేవీఎస్‌ఎం ప్రసాద్, మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి, కల్లూరు తహసీల్దార్ మునివేలు, ఏఎస్‌వో రామాంజనేయరెడ్డి, రైతు బజారు ఎస్టేట్ అధికారి హరీష్‌కుమార్, హార్టికల్చర్ కన్సల్టెంట్ శివకుమార్ పాల్గొన్నారు.

కర్నూలు రేంజ్ డీఐజీగా డాక్టర్ కోయ ప్రవీణ్



కర్నూలు(అర్బన్): కర్నూలు రేంజ్ డీఐజీగా డాక్టర్ కోయ ప్రవీణ్‌ను నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈయన గ్రేహౌండ్స్ డీఐజీగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ డీఐజీగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ విజయరావును డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విజయరావు ఈ ఏడాది ఫిబ్రవరి 5న ఇక్కడ డీఐజీగా బాధ్యతలు చేపట్టడం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఐపీఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా కర్నూలు రేంజ్ డీఐజీగా కోయ ప్రవీణ్ నియమితులయ్యారు.

చినుకు..కునుకు



ఆకాశం మేఘావృతమై కనిపిస్తున్నా ఆశించిన వాన కురవడం లేదు.. పచ్చని పొలాలను కాపాడుకునేందుకు పక్షం రోజులుగా ఎదురు చూస్తున్న అన్నదాతకు నిరాశే మిగులుతోంది. వరుణుడు కరుణ కోసం యాగాలు, పూజలు చేస్తున్నా ఫలితం ఉండటం లేదు. గురువారం కర్నూలు నగరాన్ని మేఘాలు చుట్టేసినా చినుకు పడకపోవడం ఆశ్చర్యానికి గురిచేసింది.

–సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు

'ఉపాధి' కల్పనలో వెనుకబడిన కర్నూలు



సమీక్షకు హాజరైన జిల్లా అధికారులు, (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

- తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా
- వలసల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశం

కర్నూలు(సెంట్రల్): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు పనులు కల్పించడంలో కర్నూలు జిల్లా వెనుకబడి ఉందని కలెక్టర్ పి.రంజిత్ బాషా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కుటుంబానికి సగటు 'ఉపాధి' కల్పనలో కర్నూలు జిల్లా 26.93 శాతంతో రాష్ట్రంలో 25వ స్థానంలో, పనిదినాలను కల్పించడంలో 99 శాతంతో 15వ స్థానంలో ఉన్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో అధికారుల పనితీరు మెరుగు పరచుకోవాలని, లేదంటే తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్, ఉపాధి హామీ పథకాలపై గురువారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వలసల నివారణపై అధికారుల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏమి చేస్తే వలసల నివారణ సాధ్యమవుతుందో పరిశీలన చేయాలన్నారు. ఆలూరు నియోజకవర్గంలోని హాలహర్వి, ఆస్పరి మండలాలతోపాటు తుగ్గలి, కోడుమూరు, వెల్దుర్తి, కృష్ణగిరి, నందవరం మండలాల్లో తక్కువ శాతం ఉపాధి పనులు కల్పించారన్నారు. కృష్ణా జిల్లాలో 193 , పార్వతీపురం మన్యంలో జిల్లాలో 164 శాతం పనులు కల్పిస్తే కర్నూలులో 99 శాతం మాత్రమే పనులు కల్పించడం ఏమిటని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో ఉపాధి హామీ పనుల లక్ష్యాన్ని 200 శాతంగా పెట్టుకొని పనిచేయాలన్నారు. జిల్లాలో 1.50 లక్షల జాబ్ కార్డులు ఏకారణంతో ఇన్‌యాక్టివ్‌లో ఉన్నాయో తెలుసుకొని నివేదిక ఇవ్వాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డిని ఆదేశించారు. కోస్తా ప్రాంతంలో ప్రతి గ్రామానికి రెండు చెరువులు ఉంటాయని, ఒక దానిని సాగునీటి కోసం, మరోదానిని తాగునీటి కోసం వినియోగిస్తారన్నారు. ఇక్కడ కూడా చెరువులు, కాలువలను నీటితో నింపే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ కార్యక్రమాల గురించి అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. జిల్లా పంచాయతీఅధికారి నాగరాజునాయుడు, డ్వామా పీఆర్ ఎస్‌ఈ రామ్మోహన్, డ్వామా ఏపీడీలు, పీఆర్ డీఈలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.6.11 కోట్లతో ఎంఐడీహెచ్ కార్యక్రమాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్(ఎంఐడీహెచ్) కింద రూ.6.11 కోట్లతో వివిధ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... జిల్లా ఉద్యాన యంత్రాంగం రూ.6.81 కోట్లతో ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం రూ.6.11 కోట్లతో ఎంఐడీహెచ్ యాక్షన్ ప్లాన్‌కు ఆమోదం తెలిపిందన్నారు. పండ్లు, పూల తోటలు, కూరగాయల సాగు 583 హెక్టార్లలో అభివృద్ధి చేసేందుకు రూ.86.72 లక్షల రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు. 2022-23, 2023-24 సంవత్సరాల్లో అభివృద్ధి చేసుకొన్న తోటల మెయిన్‌టెనెన్స్ కోసం రూ.10.21 లక్షలు మంజూరు అయినట్లు పేర్కొన్నారు. రక్షిత సాగు కింద హైవాల్యు విజిటబుల్స్ (కాప్సికమ్, కీరదోస, చెర్రి, టమాట) సాగు, మల్చింగ్, యాంటిబర్డ్ నెట్‌లకు రూ.27.45 కోట్లు విడుదల అవుతున్నట్లు తెలిపారు. పంట కోత అనంతర యాజమాన్య పద్ధతులు ప్యాక్‌హౌస్‌లు, కోల్డ్‌స్టోరేజీలు, ఉల్లి గోదాములు, కోల్డ్ రూముల ఏర్పాటుకు రూ.2.83 కోట్లు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. హార్టికల్చర్ మెకనైజేషన్ కోసం రూ.12.30 లక్షలు విడుదల అయ్యాయని తెలిపారు. మొత్తంగా ఎంఐడీహెచ్ కింద రూ.6.11 కోట్లతో వివిధ పథకాలు అమలు చేస్తున్నామని, కార్యాచరణపై వెంటనే చర్యలు తీసుకుంటున్నట్లుగా ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి

బొమ్మలసత్రం: నంద్యాల మండలం అయ్యలూరు గ్రామ శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ దుర్మరణం చెందాడు. ట్రాఫిక్ సీఐ ఇస్మాయిల్ తెలిపిన వివరాల మేరకు.. మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన సీతారామ్‌సింగ్ (53) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ముగ్గురు ప్రయాణికులతో నంద్యాల పట్టణానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న సీతారామ్‌సింగ్ అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న ముగ్గురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నంద్యాల సర్వజన ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య


ఈరన్న (ఫైల్)

కౌతాళం: భార్య కాపురానికి రాలేదని ఓ వ్యక్తి ఇంటి ముందు ఉన్న వేప చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కౌతాళం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వల్లూరు గ్రామానికి చెందిన వాసయ్యగారి ఈరన్న (22)కు కర్ణాటక రాష్ట్రానికి చెందిన పార్వతితో ఐదు సంవత్సరాల క్రితం వివాహమైంది. కొన్ని రోజుల వరకు వీరి సంసారం సజావుగా సాగిన తర్వాత ఈరన్న మద్యానికి బానిసై నిత్యం భార్యతో గొడవ పడేవాడు. దీంతో భార్య రెండు సంవత్సరాల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి తాగుడుకు మరింత బానిసై భార్య ఇక కాపురానికి రాదని మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం మద్యం సేవించి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. రాత్రి అందరూ నిద్రిస్తుండగా ఇంటి ముందు వేపచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం నిద్రలేచిన కుటుంబ సభ్యులు ఇంటి ముందు వేపచెట్టుకు వేలాడుతున్న ఈరన్న మృతదేహం చూసి రోదించారు. మృతుని తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక తీసుకెళ్లాలంటే మామూళ్లు ఇవ్వాల్సిందే!

- ట్రాక్టర్ యజమానులపై ఎక్సైజ్ కానిస్టేబుల్ రుబాబు

డోన్: ఎక్సైజ్ కానిస్టేబుల్ రంగముని ఇసుక ట్రాక్టర్లను ఎక్కడపడితే అక్కడ ఆపి మామూళ్లు వసూలు చేస్తున్నారని గృహ నిర్మాణదారులు, ట్రాక్టర్ యజమానులు ఆరోపిస్తున్నారు. గురువారం ఉదయం వైఎస్‌ఆర్ నగర్ వద్ద గృహ నిర్మాణాలకు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డగించడమే కాక మామూళ్లు చెల్లించాలని డిమాండ్ చేసినట్లు బాధితులు తెలిపారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం నుంచి ఉచితంగా ఇసుకను తరలించేందుకు మార్గదర్శకాలు రానందువల్లే తమ సిబ్బంది ఇసుక ట్రాక్టర్లను అడ్డగించి ఉంటారని ఎక్సైజ్ అధికారి ఒకరు సమాధానమిచ్చారు. ఉచిత ఇసుక పాలసీలో భాగంగా సెబ్ అధికారులు అడ్డుకోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణదారులు, ట్రాక్టర్ యజమానులు కోరుతున్నారు.


సొంత అవసరాలకు వీల్‌చెయిర్లు..


వార్డ్ బాయ్ లేక తప్పని అవస్థలు

● 'సర్వజన' కష్టాలు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు చికిత్స కోసం ప్రతి రోజూ వేలాది మంది రోగులు వస్తుంటారు. రాయలసీమ జిల్లాలతో పాటు కర్ణాటకలోని బళ్లారి, తెలంగాణ రాష్ట్రంలోని జోగుళాంబ గద్వాల జిల్లా వాసులకు ఈ ఆసుపత్రి పెద్ద దిక్కు. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను ఇక్కడే తీసుకొస్తుంటారు. అయితే ఆసుపత్రిలో వార్డు బాయ్‌ల కొరత ఉండటంతో స్కానింగ్‌లకు, ఎక్స్‌రేలకు, రక్త పరీక్షల కోసం రోగుల వెంట వచ్చిన సహాయకులే స్ట్రెచ్చర్లలో తీసుకుపోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వార్డు బాయ్‌లను నియమించాలని రోగులు కోరుతున్నారు.

– ఫొటోలు: సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



వైద్య పరీక్షలకు తల్లిని తీసుకెళ్తున్న కుమారుడు


వైద్యం అందుకోవాలంటే ఈ కష్టాలు తప్పవు..


ఆలస్యమైతే ప్రాణానికే ప్రమాదం..అందుకే ఇలా



ఇక్కడ ఇలాంటి దృశ్యాలు నిత్యకృత్యం


కాలు విరిగిన వ్యక్తిని వార్డుకు తీసుకెళ్తున్న బంధువులు

గాయపడిన బాలుడికి మెరుగైన వైద్యం


బాలుడిని పరిశీలిస్తున్న డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న విద్యుత్‌లైన్ తాకి గాయపడిన బాలుడికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదోని మండలం ఇస్వి గ్రామానికి చెందిన ఈరమ్మ, బసవరాజు దంపతుల కుమారుడు హుసేని(5) ఈ నెల 9వ తేదీన అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న విద్యుత్‌లైన్ తాకి గాయపడిన విషయం తెలిసిందే. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో చికిత్స పొందుతున్న ఈ బాలుడిని గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. బాలునికి ఎడమ చేయితో పాటు శరీరంలో కొంత భాగం కాలిపోయిందని, ప్రాణాపాయస్థితి లేదని తెలిపారు. అనంతరం బాలుడి తల్లిదండ్రులతో మాట్లాడి వారికి మనోధైర్యం చెప్పారు. ఎలాంటి వైద్యసహాయం కావాలన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి గురించి ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి ఆరా తీశారని చెప్పారు. సూపరింటెండెంట్ వెంట ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌ఓడి డాక్టర్ మంజులబాయి, వైద్య సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ ఖర్చులతోనే వైద్య చికిత్స

కర్నూలు(సెంట్రల్):విద్యుదాఘాతంతో గాయపడిన బాలుడు హుసేని వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో బాలుడికి చికిత్స అందిస్తున్నారని, బొటన వేలుకు చిన్నపాటి సర్జరీ జరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన అంగన్‌వాడీ హెల్పర్, విద్యుత్ లైన్‌మ్యాన్, సీడీపీఓ, సూపర్‌వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీచేశామని పేర్కొన్నారు. ప్రమాదానికి కారణమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తులో ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో అంగన్‌వాడీ సెంటర్లకు సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వివరాలు సేకరించి వాటి నుంచి ప్రమాదాలు జరిగే అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

పంచాయతీల్లో పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న డీపీఓ నాగరాజునాయుడు

కర్నూలు(అర్బన్): పంచాయతీల్లో పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు ఆదేశించారు. తన కార్యాలయంలో జిల్లాలోని డివిజినల్ పంచాయతీ అధికారులు, సిబ్బందితో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు రావడంతో 76 శాతం మాత్రమే పన్ను వసూళ్లయ్యాయని, ఈ నెలాఖరు నాటికి వంద శాతం వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మంచినీటి ట్యాంకులను ప్రతి నెలా 2 నుంచి 5వ తేదీలోగా ఒక పర్యాయం, 17 నుంచి 20వ తేదీలోగా రెండో పర్యాయం శుభ్రం చేయాలన్నారు. ఆయా ట్యాంకుల సమీపంలోని ఐదుగురు నివాసితులతో సంతకాలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. పంచాయతీల్లో వీధి దీపాలు పగటి పూట వెలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కర్నూలు, ఆదోని, పత్తికొండ డివిజినల్ పంచాయతీ అధికారులు తిమ్మక్క, నూర్జహాన్, ప్రకాష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మృత్యు పిలుపులు!


యూ ఆకారంలో ఉన్న మలుపు


ప్రమాదకరంగా గోర్లగుట్ట మలుపు

బేతంచెర్ల : బేతంచెర్ల – బనగానపల్లెకు వెళ్లే రహదారిలోని మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మలుపుల్లో ప్రమాదాలు నిత్యకృత్యం. రోజూ వందలాది లారీలు, ట్రాక్టర్లు ఈ రహదారి గుండా గోర్లగుట్ట, బనగానపల్లె మండలం పలుకూరు, రామకృష్ణాపురం, ఎర్రగుడి ప్రాంతాల నుంచి గనుల నుంచి వెలికి తీసిన నాపరాళ్లను, తెల్లగడ్డెలు, బేతంచెర్ల పరిశ్రమలకు చేరవేస్తుంటాయి. అయితే ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోక పోవడం, అనుభవం లేని డ్రైవర్లు నియంత్రణలేని వేగంతో మలుపులో వాహనాలు నడుపడం ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. మలుపుల్లో తరచూ మరమ్మతుల పేరుతో నిధులు ఖర్చు చేయడం మినహా.. ప్రమాదాల నివారణకు సంబంధించి డ్రైవర్లకు అవగాహన కల్పించిన దాఖలు లేవు. ప్రమాదాలను నివారించడానికి.. మలుపుల్లో నియంత్రణ కూడిన వేగంతో వాహనాలు నడిపేలా చర్యలు తీసుకోవడంతో పాటు, లైసెన్స్ కలిగిన వారు మాత్రమే నడిపేలా చర్యలు చేపట్టాలి. 2005 అక్టోబర్ 19న గోర్లగుట్ట మలుపులో జరిగిన లారీ ప్రమాదంలో 13 మంది మృతి చెందారు. నాడు రాజకీయ నాయకులు,అధికారుల పరామర్శలు తప్ప ప్రమాదాల నివారణకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేదు.2011లో 9మంది, 2012లో19 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారు. 2015- 2016 వరకు ఆరుగురు మృత్యువాత పడ్డారు. 2015 ఫిబ్రవరి 11న బనగానపల్లె మండలం పలుకూరు గ్రామానికి చెందిన ఉప్పరి దేవేంద్ర ద్విచక్రవాహనం బోల్తాపడిన సంఘటనలో మృతి చెందాడు. అలాగే మే 7న ఆళ్లగడ్డ మండలం, చింతకుంట గ్రామానికి చెందిన లారీ బ్రేకులు ఫెయిలై డ్రైవర్ పెద్దయ్య మృతి చెందాడు. అక్టోబర్ 19న ఆటో బోల్తాపడిన సంఘటనలో ఓర్వకల్లు మండలం కనమడకల గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి రాఘవేంద్ర మృతి చెందాడు. 2016 మార్చి 20న బనగానపల్లె మండలం పలుకూరు గ్రామానికి చెందిన పరదేశి శిలాస్ బైక్‌పై నుంచి కింద పడి మృతి చెందాడు. అక్టోబర్ 8న కోవెలకుంట్ల మండలం పెద్దకొప్పెర్ల గ్రామానికి చెందిన ఆర్మీజవాన్ ఎర్రం సురేష్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదు రుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. కాగా.. ముఖ్యంగా బనగానపల్లె రహదారిలోని గోర్లగుట్ట, కర్నూలు రహదారిలోని గోరుమానుకొండ, సీతారామపురం మెట్ట వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలా ఏటా ప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్న యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కన్న కొడుకే కాలయముడు

- రోకలిబండతో తల్లిని హతమార్చిన కొడుకు


అంగజాల నాగలక్ష్మమ్మ (ఫైల్)

పాణ్యం: మతిస్థిమితం సరిగాలేని ఓ కొడుకు చేతిలో తల్లి దారుణహత్యకు గురైంది. ఈ ఘటన వడ్డుగండ్ల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. సీఐ నల్లప్ప తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అంగజాల గోపాల్, నాగలక్ష్మమ్మ(58) దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇక కుమారుడు ఉన్నారు. కుమారుడు మహేష్‌కు మద్యానికి బానిసై కొంత కాలంగా మానసిక స్థితి సరిగ్గా లేదు. ఇంటి వద్దే ఉంటున్నాడు. కిరాణ దుకాణం నిర్వహిస్తున్న గోపాల్ మంగళవారం ఉదయాన్నే వెళ్లాడు. అయితే నాగలక్ష్మమ్మ ఇంట్లో నుంచి ఎంత సేపటికి బయటకు రాకపోవడంతో పొరుగింటి వాళ్లు అనుమానంతో వెళ్లి చూశారు. నాగలక్ష్మమ్మ తీవ్రగాయాలతో రక్తపుమడుగులో పడి మృతి చెందింది. కాగా మతిస్థిమితం లేని కుమారుడు మహేష్ (34) తల్లిని రోకలి బండతో తలపై మోది చంపేసి అక్కడి నుంచి పొలాల వైపు వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న మృతురాలు భర్త గోపాల్ ఇంటికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ అశోక్ గ్రామానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు.కాగా మహేష్ పాణ్యం పోలీసు స్టేషన్‌కు చేరుకుని తన తల్లిని చంపేసినట్లు ఒప్పుకుని లొంగిపోయినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గోవర్ధనగిరిలో 'అపరాల' పథకం అమలు

- బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ అశోక్ కుమార్


మాట్లాడుతున్న డాక్టర్ అశోక్ కుమార్

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలం గోవర్ధనగిరి గ్రామంలో ఐదేళ్లపాటు అపరాల సాగు పథకాన్ని అమలు చేస్తున్నామని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. గురువారం గ్రామ రైతుభరోసాకేంద్రంలో కేవీకే ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పీఆర్‌జీ 176 రకం కంది విత్తనాలను ఉచితంగా అందించారు. అధిక దిగుబడులు సాగించే విధంగా రైతులకు సలహాలందించారు. ఆర్బీకే పరిధిలోని పత్తి పంటను పరిశీలించి చీడపీడల నివారణకు తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో పత్తికొండ ఏడీఏ విజయ్‌కుమార్, కేవీకె ఎస్‌ఎమ్‌ఎస్‌లు డాక్టర్ ఎంవీ నిరంజన్‌రెడ్డి, డాక్టర్ చందన, ఏఓ అక్బర్‌బాషా, ఆర్బీకేల సిబ్బంది లింగన్న, స్వరూప, మధు, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయొద్దు

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జీ లీలా వెంకటశేషాద్రి


మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కర్నూలు(అర్బన్): విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీ లీలా వెంకటశేషాద్రి అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక న్యూ కృష్ణానగర్‌లోని ప్రభుత్వ బీసీ బాలికల సంక్షేమ వసతి గృహంలో యూపీఎస్‌ఈ శరీన్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ సహకారంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ, జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి పీ వెంకటలక్షుమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరచూ వచ్చే జలుబు, జ్వరం, తలనొప్పి తదితర వాటిని ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయరాదన్నారు. అనంతరం ఆయన హాస్టల్‌ను పరిశీలించి అక్కడ అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వైద్యులు డాక్టర్ ఫర్హాన్ తబ్సుమ్ , శిక్షణా న్యాయాధికారులు ఎం లీలా సాయి సుభాష్, ఏవీ సాయి శ్రీవల్లి, ఎం ఈశ్వర వెంకటప్రసాద్, కే హేమ, వసతి గృహ సంక్షేమాధికారిణులు వెంకట ప్రమీల, శారద తదితరులు పాల్గొన్నారు.

కడ్లమాగిలో అగ్ని ప్రమాదం

- రెండు గుడిసెలు, పశువుల పాక దగ్ధం


కాలిపోతున్న గుడిసెలు


కాలిపోయిన గుడిసెల వద్ద బాధితులు

హొళగుంద: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కడ్లమాగి గ్రామంలో గురువారం గుడిసెలు కాలిపోయి భారీగా ఆస్తినష్టం సంభవించింది. బాధితుల కథనం మేరకు.. మూసనపల్లి శంకరయ్య, హిరెత్తిన మల్లయ్య మరి కొంత మంది కడ్లమాగిలో నివాసముంటున్నారు. వీరు గురువారం పనుల నిమిత్తం పొలాలకు, ఆలూరుకు వెళ్లారు. ఆ సమయంలో ఉన్నట్టుండి గుడిసెలుకు మంటలు అంటుకుని కాలిపోసాగాయి. చుట్టు పక్కల పొలాలో ఉన్న రైతులు విషయాన్ని బాధితులతో పాటు పోలీసులకు , ఫైర్‌స్టేషన్లకు సమాచారం అందించారు. వారొచ్చే సమయానికి ఇద్దరి గుడిసెలతో పాటు ఒక పశువుల పాక పూర్తిగ కాలి బూడిదైయ్యాయి. మిగిలిన వాటికి మంటలు వ్యాపించకుండా స్థానికులు మంటలను ఆర్పి వేసారు. ఈ ప్రమాదంలో మూసనపల్లి శంకరయ్య గుడిసెతో పాటు రూ.50 వేలు నగదు, 13 బస్తాల కందులు, మిరప, సజ్జ పూర్తిగ కాలిపోయాయి. అదేవిధంగా హిరెత్తిన మల్లయ్య గుడిసెతో పాటు రూ.5 లక్షల నగదు, 4 తులాల బంగారం, 20 తులాల వెండితో పాటు ఇంటి పత్రాలు, పొలం పాసు బుక్కులు, ఇతర నిత్యావసర సరుకులు, వంట సామాగ్రి కాలిపోయాయి ప్రమాద స్థలానికి ఆర్‌ఐ దినోజ్, వీఆర్‌ఓ నాగరాజు, పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్


పేకాటరాయుళ్ల నుంచి స్వాధీనం చేసుకున్న బైక్‌లు

శ్రీశైలం: శ్రీశైలం దేవస్థానం పరిధిలోని అటవీ ప్రాంతంలో గురువారం పేకాడుతున్న 20 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ ప్రసాద్‌రావు తెలిపిన వివరాల మేరకు.. గణేష్ సదన్ వెనుక భాగంలోని అటవీ ప్రాంతంలో పేకాటాడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. చెట్ల కింద గుంపులు గుంపులుగా పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. శ్రీశైలానికి చెందిన వెంకట లింగం, బోయపాటి మధు, కల్లూరు అనిల్, తెలుగు నాగలింగం, మల్లారెడ్డి, సురేష్ కుమార్, దూదేకుల కాశి, షేక్ నిరంజన్, ముర్తు జావలి, సురేంద్ర, ఎస్‌ఎం జవాలీ, శ్రీను, ప్రసాద్, జనార్దన్ రెడ్డి, నవీన్, ఐ.మల్లి, నరేష్, చిన్న ముత్తు, నాగ మల్లికార్జున్‌తో కలిపి మొత్తం 20 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,21,190 నగదుతో పాటు 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో వన్‌టౌన్ పోలీసులు రఘునాథుడు, అమర్నాథరెడ్డి, మహేష్, నారాయణ, శంకర్, బాలకృష్ణ పాల్గొన్నట్లు తెలిపారు.

కుక్కను వేటాడిన చిరుత

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని స్థానిక టోల్‌గేట్ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో చిరుత పులి కుక్కను వేటాడి నోట కరుచుకొని అడవిలోకి పారిపోయింది. అటుగా వస్తున్న వాహనదారులు ఆ దృశ్యాన్ని కెమెరాలో బంధించారు. గడిచిన ఐదు నెలల్లో చిరుత పులి స్థానికంగా రింగ్ రోడ్డు, రుద్ర పార్క్, సాక్షి గణపతి, రామయ్య టర్నింగ్, తదితర ప్రదేశాలలో సంచరిస్తుండడంతో వాహనదారులు స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


కుక్కను నోట కరుచుకొని అడవిలోకి వెళ్తున్న చిరుత